మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# దేశ ఐక్యతకు ప్రాధాన్యం

**దేశ చరిత్రను తిరగరాసిన నాయకుడు రాజీవ్ గాంధీ**

**దేశ పునర్నిర్మాణంలో ఆయన కృషి అమోఘం**

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 21, ప్రభాతవార్త :** దేశ చరిత్రను తిరగరాసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద వారి విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం కన్నీరు పెట్టించిన ఆ దుర్దినం మన దేశ చరిత్రలో ఎప్పటికీ మరిచిపోలేని రోజు అని అన్నారు. రాజీవ్ గాంధీ యువ ప్రధానిగా దేశానికి కొత్త దిశ చూపించారని, ఆయన కళ్ళలో ప్రేమ, మాటల్లో మృదుత్వం, వ్యక్తిత్వంలో హుందాతనం స్పష్టంగా కనిపించేవన్నారు. తల్లి ఇందిరా గాంధీ హత్య అనంతరం దేశం కష్టాల్లో ఉన్న సమయంలో బాధను జీర్ణించుకుని ప్రజలను ఏకం చేసి దేశ పునర్నిర్మాణానికి ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. ఆయన పాలనలో దేశ ఐక్యతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్ వంటి ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి చర్చలు జరిపి, ప్రజలకు గౌరవం కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. దేశాభివృద్ధికి పునాది వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని, పంచాయతీ రాజ్ వ్యవస్థ బలపరిచి, స్థానిక సంస్థలకు అధికారాల వికేంద్రీకరణ, కంప్యూటర్, సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం వంటివి అన్నీ ఆయన దూరదృష్టిని ప్రతిబింబిస్తాయని ఆయన చెప్పారు. భారతదేశంలో కంప్యూటర్ యుగానికి నాంది పలికిన నాయకుడు కూడా ఆయనే అని ఆయన స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు ఉగ్రవాద దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారని. ఆయన మరణం దేశానికి తీరని నష్టం అని, అయినా ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన చెప్పారు. ప్రతి సంవత్సరం మే 21ను ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తూ, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, భౌతికంగా మనతో లేకపోయినా, ఆయన చూపిన మార్గం, ఆశయాలు మనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, కార్పొరేటర్లు రమేష్ రెడ్డి, పెద్ద గొల్ల నర్సింహులు, గులాం జహీర్, రమేష్ బాబు, ప్రశాంత్ , ఫయాజ్ , నాయకులు బి.మోహన్ బాబు, , రియాజ్, అంజద్, గోవింద్ యాదవ్, తెలుగు గూడెం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

# నైపుణ్య శిక్షణతో ఉజ్వల భవిష్యత్తు

**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ**

**మహబూబ్‌నగర్, మే 21, ప్రభాతవార్త :** మహబూబ్ నగర్‌లో టాస్క్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి ఆధారిత శిక్షణద్వారా యువతకు మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గతంలో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో ఎంఎస్ ఆఫీస్ కంప్యూటర్‌కోర్సును పూర్తిచేసిన ఇంటర్, డిగ్రీ అంతకంటే పై విద్యార్హతలు కలిగిన విద్యార్థులకు ప్రస్తుతం టాస్క్ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి ఆధారిత కోర్సులలో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు ఫీజు చెల్లించలేని విద్యార్థులకు తన సొంత నిధుల ద్వారా సహాయం అందిస్తూ, టాస్క్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కల్పించడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు కూడా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉపాధి అవకాశాలను పొందగలరని అన్నారు. టాస్క్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ఆయన ప్రత్యక్షంగా మాట్లాడి, శిక్షణ విధానం, కోర్సుల నాణ్యతపై ట్రైనర్స్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ పట్ల విద్యార్థుల ఆసక్తి, నేర్చుకునే తపన ఆయనను ఆకట్టుకున్నాయి. యువతకు నైపుణ్యాలు పెంపొందించి, ఉపాధి అవకాశాలను విస్తరించే దిశగా టాస్క్ ట్రైనింగ్ సెంటర్ కీలక పాత్ర పోషిస్తున్నదని ఆయన పేర్కొంటూ టాస్క్ సంస్థ ప్రతినిధులను ట్రేనర్స్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎంపి ప్రవీణ్ కుమార్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, టాస్క్ సంస్థ ఇంచార్జీ హెచ్. సతీష్ కుమార్ , ట్రైనర్ ఎం.సతీష్, హేమంత్ పాల్గొన్నారు.



జనగణన అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

# ఇంటింటి సర్వే పారదర్శకంగా జరగాలి

**జనగణనలో ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలి**

**మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల గణన**

**నాగర్‌కర్నూల్ కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**లింగాలలో జనగణన ప్రక్రియను పరిశీలన**

**లింగాల, మే 21, ప్రభాతవార్త :** ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యూమరేటర్ల ప్రధానబాధ్యత అని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. గురువారం ఉదయం లింగాల మండల కేంద్రంలో కొనసాగుతున్న జనగణన ఇండ్ల గణన ప్రక్రియని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సేకరిస్తున్న వివరాలను తనిఖీచేసి, ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జనగణనలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలని, ప్రజలు కూడా అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ జనగణన 2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, నిర్దేశిత నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా జరగాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా – మిగతా3లో..

# ధాన్యాల కొనుగోలు కేంద్రాల పరిశీలన

**ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ముఖ్యం**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**లింగాల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**



కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**లింగాల, మే 21, ప్రభాతవార్త :** నల్లమల అటవీ ప్రాంతంలోని లింగాల మండల కేంద్రంలో పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మొక్కజొన్న, వరి కొనుగోళ్లకు రైతులకు అందుతున్న సేవలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, గ్రామ స్థాయిలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంపై ప్రత్యక్షంగా పరిశీలించి, వివరాలను సేకరించి, సమీక్ష నిర్వహించి సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. ముందుగా లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ వరి, మొక్కజొన్న ధాన్యాల కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే విధానం, తూకం ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా సరైన ప్రణాళికతో కొనుగోళ్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ధాన్యం తరలింపు ప్రక్రియకు అవసరమైన లారీలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తార్పులు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం లింగాల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్లు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన కలెక్టర్ పనుల –మిగతా3లో..

# ట్రేడర్లపై కఠిన చర్యలు..

**రైతులను మోసం చేస్తే ఊరుకోం**

**ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి హెచ్చరిక**

**మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు**



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, మే 21, ప్రభాతవార్త:** కొంతమంది ట్రేడర్లు రైతుల వద్ద పచ్చి మొక్కజొన్నను తక్కువ ధరకు కొనుగోలు చేసి, మార్కెట్ షెడ్లలో నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయించే ప్రయత్నాలు చేస్తున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్ గ్రామ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పిఎసిఎస్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గంగాపూర్ మార్కెట్ యార్డులో ఆయన చిత్రపటానికి జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రైతులు ఎలాంటి మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. రైతుల ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పూర్తిస్థాయిలో –మిగతా3లో..

# గోవుల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

**మిడ్జిల్ మున్ననూర్ చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ జానకి**



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ

**మిడ్జిల్, మే 21 ప్రభాతవార్త :** బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలలో గోవుల అక్రమ రవాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక పోస్టులను జిల్లా ఎస్పీ జానకి గురువారం నాడు తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందితో మాట్లాడుతూ వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు. అనుమానాస్పద వాహనాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని గోవుల అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా రాత్రి వేళలో ప్రత్యేక అప్రమత్తతతో విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లాఎస్పీ మిడ్జిల్ పోలీస్ స్టేషన్ సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రోడ్లపై దాన్యం ఆరబెట్టడం వలన వాహనాలు అదుపు తప్పే అవకాశం ఎక్కువగా ఉంటుందని రైతులు సూచనలు పాటించి వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. జడ్చర్ల సిఐ మహేష్, ఎస్సై శ్రీనివాసులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కేబినెట్ మంత్రి ఆదేశాలు లెక్కచేయరా..?

**కోట్ల రూపాయల ధాన్యం మాయమైనా...ఇంతటి నిర్లక్ష్యమా!**

**మిల్లులపై కేసులు సరే... కస్టోడియన్ సంగతేంటి..?**

**డీఎస్‌ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..?**

**ఉన్నతాధికారుల తీరుపై డిఓపిటిలో ఫిర్యాదు చేస్తాం...**

**బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల

**వనపర్తి, మే 21, ప్రభాతవార్త:** జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో అకతవకలు, రైస్ మిల్లుల్లో ధాన్యం బస్తాల మాయంపై సివిల్ సప్లయ్ అధికారుల అవినీతి జిల్లా కలెక్టర్‌కు కనిపించడం లేదా? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాలయుగంధర్‌గౌడ్ ప్రశ్నించారు. గురువారం జిల్లాకేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ధాన్యం మాయం చేసిన మిల్లులపై కేసులు నమోదుచేశారే కానీ అన్నింటికీ బాధ్యుడైన డిఎస్ఓపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో కలెక్టర్ చెప్పాలన్నారు. నవంబర్ నెలలో టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించి జిల్లాలోని వారాహి, చాముండి రైస్ మిల్లులు సీజ్ చేసి కేసు నమోదు చేశారన్నారు. ఈ రెండు మిల్లులకు డిఎస్ఓ కస్టోడీయన్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సరిగ్గా 6 నెలల తరువాత టాస్క్ ఫోర్స్ అధి కారులు మళ్ళీ అదే మిల్లులపై తనిఖీలు జరుపగా రూ.9కోట్లకు పైగా ధాన్యం బస్తాలు మాయం అయినట్లు గుర్తించడం జరిగిందన్నారు. గతంలో కేసు అయినప్పటికీ రెండు మిల్లులలో ఉన్నధాన్యాన్ని కస్టోడీయన్‌గా ఉన్న డిఎస్ఓ ఎందుకు షిఫ్ట్ చేయలేదని, ఆయన అండదండలతోనే ఈ తతంగం జరిగిందని ఆరోపించారు. పైగా సీజ్ చేసినమిల్లుల్లో డీఎస్ఓ (కస్టోడీయన్)కు తెలియకుండా ధాన్యాన్ని తరలించడం, మిల్లింగ్ చేయడం అసాధ్యం అని, దీనిపై కూడా విజిలెన్స్ అధికారులు విచారణ జరపాలన్నారు. జిల్లాలోని ఉన్నతాధికారుల అండదండలు డీఎస్ఓకు సంపూర్ణంగా ఉన్నాయని, ఉన్నతాధికారుల బంధువులకు సివిల్ సప్లయ్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో విధులు నిర్వహించే వ్యక్తి ద్వారా భారీ ఎత్తున ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు కూడా బీసీ పొలిటికల్ జేఏసీ సేకరించడం జరిగిందని, ఉన్నతాధికారుల పరువు తీయకూడదనే సదుద్దేశంతో వారి వివరాలు బయట పెట్టడం లేదని తెలిపారు. ఇంత పెద్ద అవినీతిపరుడైన డీఎస్ఓను ఎందుకు వెనకేసుకొస్తున్నారో జిల్లా ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. తనకు అనుకూలంగా ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం పంపించడం, తనకు నచ్చని మిల్లులకు ధాన్యం కేటాయించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ డిఎస్ఓ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. దాదాపు నాలుగైదు కొత్త రైస్ మిల్లులకు అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సాక్షాత్తు కేబినెట్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలను సైతం లెక్కచేయకుండా జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఏకంగా సివిల్ సప్లయ్ కమిషనర్ డీఎస్ఓను సరెండర్ చేయమంటే కూడా కలెక్టర్ ఎందుకు వెనకేసుకొస్తున్నాడో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. సివిల్ సప్లయ్ అధికారి తీరు వల్ల పలు విమర్శలు వస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా స్పందించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోకుంటే ఉన్నతాధికారుల తీరుపై ఢిల్లీలోని డిఓపిటిలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, కృష్ణప్రసాద్, యశ్వంత్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది

**పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి**

**కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

**దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, మే 21 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నేతృత్వంలో దేవరకద్ర నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచులకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఆర్‌జిపిఆర్‌ఎస్ నేషనల్ చైర్మన్ సునీల్ పన్వార్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షులు రాచమల్లు సిద్దేశ్వర్, డిసిసి అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ స్వరాజ్యానికి పునాది వేసిన నాయకుడని కొనియాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి – మిగతా3లో..

# పోక్సో బాధితులకు ఒకేచోట అన్ని సేవలు

**వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**



భరోసా సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మెగా రెడ్డి ,ప్లానింగ్ బోర్డ్ వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే 21, ప్రభాతవార్త:** పోక్సో బాధితులకు ఒకేచోట అన్ని సేవలు అందించడమే భరోసా కేంద్రం ముఖ్య ఉద్దేశం అని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్", ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎల్ ఎస్. చౌహాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హింస, వేధింపులు, లైంగిక దాడులకు గురైన మహిళలు, పిల్లలకు తక్షణ సహాయం, రక్షణ అందించేందుకు తెలంగాణ పోలీస్ విభాగ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయన్నారు. మద్యం సేవించడం వల్లే అనేక వేధింపులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొంటూ, ప్రజలు తమ అలవాట్లను మార్చుకుని మద్యం సేవనాన్ని తగ్గించాలని సూచించారు. హెల్త్ ఈజ్ వెల్త్" అని పేర్కొంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని తెలిపారు. పోక్సో కేసుల బాధితులకు ఒకే చోట న్యాయ సహాయం, మానసిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018లో భరోసా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. ఈ విధానం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ వారికి అవసరమైన సహాయం అందించడం భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ సహకారంతో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఐజి చారు సిన్హా నేతృత్వంలో రాష్ట్రంలో మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత పోలీసు శాఖ కల్పిస్తుందని తెలిపారు.

**క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రధానం**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా, యువజన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్‌టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలవగా, ఉపాధ్యాయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం పోలీసుసిబ్బందికి నూతనక్యాప్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, మీనా, డీఎస్పీలు బాలాజీ నాయక్, గిరి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి – మిగతా3లో..

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : కలెక్టర్ సీహెచ్ ప్రియాంక

**నారాయణపేట, మే 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్లో 22వ తేదీన ఉదయం 9:30 గంటలకు నిర్వహించనున్న జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డా. వాకిటి శ్రీహరి హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ఈదురు గాలులు, వర్షానికి చెట్లు విరిగి రాకపోకలకు అంతరాయం



రోడ్డుపై విరిగిపడ్డ చెట్లు

**నారాయణ పేట, మే 21 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలో గురువారం వీచిన బలమైన ఈదురు గాలులు, వర్షం బీభత్సం సృష్టించాయి. శ్రీ సాయి స్కూల్ సమీపంలో ఉన్న ఎన్నో సంవత్సరాల నాటి భారీ చెట్టు విరిగిపడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అదేవిధంగా చెక్‌బజార్ నుంచి దామరగిద్ద వెళ్లే మార్గంలో పలుచోట్ల చెట్లురోడ్డుపైకూలిపోవడంతో వాహనాల రాకపోకలునిలిచిపోయాయి.దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్రఅసౌకర్యానికి గురయ్యారు.అలాగే ఒకచెట్టు విద్యుత్ స్తంభంపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి పరిసర ప్రాంత ప్రజలు చీకటిలో ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న సంబంధిత అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి చెట్ల తొలగింపు పనులు చేపట్టారు.అధికారులు రహదారినిపునరుద్ధరించే పనులను వేగవంతం చేశారు.

## విఠలాపూర్‌లో మంచినీటి బోరు ఏర్పాటు చేస్తాం

### గ్రామస్తులకు హామీ ఇచ్చిన డా. రాజ్ కుమార్ రెడ్డి

**దామరగిద్ద, మే21 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామాన్ని గురువారం భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా. రాజ్ కుమార్ రెడ్డి సందర్శించారు.గ్రామస్తుల ఆహ్వానం మేరకు గ్రామానికి చేరుకున్నఆయనకు స్థానికులు ఘన స్వాగతం పలికి సన్మానించారు.అనంతరం నిర్వహించిన సమావేశంలో గ్రామంలోని సమస్యలను గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.ముఖ్యంగా బీసీకాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా తీవ్రమైన మంచినీటి సమస్య నెలకొని ఉందని, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.గ్రామస్తుల సమస్యలనువిన్న డా.రాజ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు.ముందుగా బోర్‌పాయింట్‌ను గుర్తించి, వచ్చే 15రోజుల్లో బోరుడ్రిల్లింగ్ చేపట్టి మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భీష్మరాజ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాల పరిరక్షణ మన అందరి బాధ్యత

- జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ



ఉపాధి హామీ కూలీలతో కలిసి హెరిటేజ్ వాక్ చేస్తున్న పర్యాటక శాఖ అధికారి, సర్పంచ్

**కొల్లాపూర్,మే21, ప్రభాతవార్త:** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలోలో భాగంగా సోమశిల గ్రామంలో ఉన్న పురాతన అధ్యాత్మిక,పర్యాటక క్షేత్రమైన శ్రీశ్రీశ్రీ లలితా సోమేశ్వర స్వామి దేవస్థానం గురించి గ్రామ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు వివరించి జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ, సోమశిల గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి ఆధ్వర్యం లో సోమశిల దేవస్థానం వరకు హెరిటేజ్ వాక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.సోమశిల గ్రామానికి జాతీయ స్థాయిలో ఎంతో గుర్తింపు ఉందనిజాతీయ స్థాయిలోజాతీయ అవార్డు వచ్చిందని గ్రామంలో పురాతన కట్టడాలు ఎన్నో ఉన్నాయని, మన సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉందని గ్రామ ప్రజలకు తెలియజేయడం జరిగింది. సోమశిలలో దేవాలయాలు ప్రసిద్ధ శ్రీలలిత సోమేశ్వర స్వామి ఆలయం,సోమేశ్వర స్వామి ఆలయం,మునిగిపోయిన అసలు ఆలయ ప్రతిరూపం తో సహా 15 శివాలయాలు ఉన్నాయి. సంగమేశ్వర ఆలయం సోమశిల జలాశయం మధ్యలో ఉంది. ఈసంగమేశ్వర ఆలయానికి దర్శనం చేసుకోవడానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తు ఉంటారు.ఈ కార్యక్రమంలో సోమశిల గ్రామ మాజీ సర్పంచ్ బింగి మద్దిలేటి, పురాతన శాఖ పర్యవేక్షకుడు కురుమయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటం నారాయణ, కాటం మౌలాలి పాల్గొన్నారు.

## నవాబుపేట ఎస్సై విక్రమ్ బదిలీ

- టపాసులు పేల్చి సంబరాలు చేసుకున్న బీజేపీ నాయకులు

**నవాబుపేట, మే 21 ప్రభాతవార్త:** నవాబ్‌పేట ఎస్సై బదిలీ సందర్భంగా ఆయన చేసిన అవినీతి ఆరోపణలపై మండల వ్యాప్తంగా ఎస్సై విక్రంబదిలీ కావటంతో ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. అవినీతి ఆరోపణలపైఎదుర్కొంటున్న ఎస్ఐపై అధికారుల అండతో అమాయక ప్రజలను పీడించి దౌర్జన్యం చేసి లక్షలరూపాయలు సంపాదించి అవినీతి సొమ్ముతో ఆస్తులు కూడగట్టుకున్నాడు. ఈ సందర్భంగా పోలీస్ వ్యవస్థకు మచ్చ తెచ్చిన ఇలాంటి ఎస్ఐని భర్తరఫ్ చేయాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేశారు. ఆయనను బదిలీ చేయడంతో భారతీయ జనతా పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో భారీ ఎత్తున పోలీస్ స్టేషన్ ఎదురుగా బాణసంచాలు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల బిజెపి అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జిల్లా కాన్సిల్ మెంబర్ శ్రీనివాసులు, మండల ప్రధాన కార్యదర్శి గణేష్, మండల బిజెపి నాయకులు నరేష్, సోషల్ మీడియా కన్వీనర్ బూత్ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.


## వరి ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

**పెబ్బేరు, మే21 ప్రభాతవార్త:** కల్లాలలోనే వరి ధాన్యం పెట్టుకుని రైతులు ఆందోళనకు గురవుతున్నారని ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం సేకరించాలని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ కార్యాలయం ముట్టడించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, క్రాంతి కుమార్‌లు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట జరుగుతున్న మోసాలు కొనుగోలులో ఆలస్యం కారణంగా అకాల వర్షాలతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాఘవేంద్ర గౌడ్, రంగస్వామిగౌడ్, మండల అధ్యక్షులునాగరాజు,నరసింహనాయుడు, రామకృష్ణ, కసిరెడ్డి వెంకట్రామిరెడ్డి, చింతకాయల శివ, సర్వేశ్వర్ గౌడ్, రాఘవేంద్ర, గోనెల అరవింద్, గోవింద నాయుడు, రఘురాం బలరాం తదితరులు పాల్గొన్నారు.

## బోరులో నుంచి ఉబ్బికి వస్తున్న నీరును పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

**కొల్లాపూర్,మే 21,ప్రభాతవార్త:** పెద్దకొత్తపల్లి మండలంలోని చంద్రబండ తండా గ్రామ పంచాయతీ సమీపంలోని ఒక్కకిలో మీటర్ దూరంలో స్మశాన వాటిక దగ్గర గత ఐదు సంవత్సరాల క్రితం వేసిన బోరులో నుంచి వస్తున్న నీటిని గురువారం పెద్దకొత్తపల్లి మండల ఆర్‌డబ్ల్యూఎస్,ఏఈ రోహిత్, గ్రామ సర్పంచ్ కేతావత్ చిట్టి శంకర్ నాయక్,ఉప సర్పంచ్ కేతావత్ శంకర్ నాయక్,పంచాయతీ కార్యదర్శి మహేష్ లు పరిశీలించారు. గ్రామ సమీపంలో వృధాగా ఉన్న బోరు గత నాలుగు రోజుల నుండి మే నెలలో తీవ్రమైన ఎండలో కూడా ఉబికి నీరు పైకి రావడం మాగ్రామ ప్రజలను రైతులకు ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు.ఈ బోరును పరిశీలించడానికి మండల అధికారి రోహిత్ వచ్చి పరిశీలన చేశారు. తక్షణమే బోరులో మోటార్ వేసే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు,సర్పంచ్ ,ఉప సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ జన్మదిన వేడుకలు



**వెల్దండ, మే 21 ప్రభాతవార్త:** రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బస్టాండ్ ఆవరణలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానుల సమక్షంలో గోలి శ్రీనివాస్ రెడ్డి కేక్ కట్ చేసి తినిపించి, శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పుట్ట రాంరెడ్డి అనిల్ కుమార్, వెంకటయ్య గౌడ్ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరరావు, నాగులు నాయక్, శేఖర్ ముదిరాజ్, సర్పంచులు కొండల్ యాదవ్, శ్రీనివాసులు, జోగయ్య భీమయ్యగౌడ్, నిరంజన్,అంజా నాయక్, ఆనంద్, గుత్తి వెంకటయ్య, ప్రవీణ్, జ్యోతి నిరంజన్, బాల్ లక్ష్మయ్య, నరసింహ ముదిరాజ్, దేవేందర్, శేఖర్ లింగం ముదిరాజ్, గండికోట రాజు, నాగయ్య, శివ ఎంఎస్ గౌడ్‌తోపాటు తదితరులు ఉన్నారు.

# మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీకి ఘన నివాళి









**కల్వకుర్తి, మే 21 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీపట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఖలీల్, కౌన్సిలర్‌లు రాజేష్ కుమార్, కోడెల గణేష్ యాదవ్,మాజీ వైస్ఎంపీపీ ఆంజనేయులు,మాజీ సర్పంచ్ దామోదర్ గౌడ్,నాయకులు సోఫి,నాని యాదవ్, ఆరిఫ్, అజీమ్, దున్న భాస్కర్,పడకంటి వెంకటేష్, దున్న సురేష్, మహేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వెల్దండ, మే 21 ప్రభాతవార్త:** భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలోడిసిసి ఉపాధ్యక్షులు యెన్నం భూపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరికిషన్ నాయక్, దిశ కమిటీ సభ్యులు మోతిలాల్ నాయక్ , కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, సర్పంచ్ మట్ట యాదమ్మ, వెంకటయ్య గౌడ్, తారా సింగ్, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, నాగేశ్వర్ గౌడ్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్లయ్య, మట్ట భరత్‌గౌడ్ ఈదులపల్లి శ్రీనివాస్,కిష్టాల్,బాబానర్సింగ్‌నాయక్‌తోపాటు తదితరులున్నారు.

**అచ్చంపేట, మే,21 ప్రభాతవార్త:** దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ అన్నారు. రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా పట్టణంలో రాజీవ్ గాంధీ కూడలివద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, రామనాథం, అంతటి మల్లేష్, చంద్రమోహన్, కటకం రఘురాం, కాంగ్రెస్ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమరచింత మే 21,ప్రభాతవార్త;** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం అమరచింత పట్టణంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, రమేష్ ముదిరాజ్, మార్కెట్ డైరెక్టర్లు శ్యామ్ కుమార్, కమలాకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ కిషన్ సెల్ మండల అధ్యక్షులు లక్ష్మీకాంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు హనుమంతు నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జింక రవి యాదవ్,శ్రీధర్, అశోక్ గౌడ్, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్, చిన్న, రాజు, చరణ్, సుధాకర్, రీకో, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గోపాల్ పేట,మే21 ప్రభాతవార్త:** గోపాల్‌పేట్ మండల కేంద్రంలో మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి వేడుకలను ఉమ్మడి మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు మంద సత్యశీల రెడ్డి, వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు కొంకి వెంకటేష్, వనపర్తి జిల్లా జనరల్ సెక్రటరీ శివన్న, ధీరమల్లు యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పి.సుధాకర్ రావు,గోపాల్‌పేట్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎం.డి బాలపీరు, జిల్లా యూత్ కాంగ్రెస్ ఆర్టీఐ చైర్మన్ కొంకి రమేష్, తాడిపర్తి గ్రామసర్పంచ్ లోకారెడ్డి, మాజీ ఎంపీటీసీ మేస్త్రి బాలయ్య,పీక్య నాయక్, కొంకలి కృష్ణయ్య, శ్రీనివాస్ చారి, అబ్దుల్లా, యాదగిరి, కొంకలి శ్రీశైలం, వడ్డేమాన్ శివ, రాజా వర్ధన్ గౌడ్, బత్తుల శ్రీశైలం, గోపాల్‌పేట్ మండల కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ ప్రవీణ్ కుమార్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**రాజాపూర్, మే 21 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన పలు సేవా కార్యక్రమాలను కొనియాడారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు రాజీవ్‌గాంధీ అడుగుజాడల్లోనడవాలని కోరారు. ఈ కార్యక్రమంలోపలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక రవాణా అనుమతులు

- ఇసుక రవాణాలో ప్రతి దశలో పర్యవేక్షణ తప్పనిసరి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్‌కర్నూల్, మే21 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లాలో ఇసుక తవ్వకాలు, రవాణా, సరఫరా వ్యవస్థను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ (డీఎల్ఎస్‌సీ) సమావేశం నిర్వహించారు. సమావేశానికి అదనపు కలెక్టర్ అమరేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే జిల్లాలో ఇసుక రవాణాకు అనుమతులు జారీ చేస్తున్నామని తెలిపారు. నిబంధనల అతిక్రమణను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా సంబంధిత శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పట్టా భూముల్లో ఇసుక రీచుల అనుమతుల అంశాన్ని సమగ్రంగాపరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రానున్న వర్షాకాలంలో ఇసుక తవ్వకాలు నిలిచిపోయేఅవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు,కొత్త ఆసుపత్రులు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టులు తదితర ప్రభుత్వ రంగ నిర్మాణాలకు అవసరమైన ఇసుక కొరత లేకుండా చూడాలని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతర ఇసుక సరఫరా అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు.వివిధ ఇంజనీరింగ్ విభాగాలతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్, నిర్మాణ అవసరాలకు అనుగుణంగా ఏ ఇసుక రీచ్ నుంచి సరఫరా చేయాలనే అంశంపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లాకు అవసరమైన ఇసుక లక్ష్యాన్ని నిర్ణయించిన నేపథ్యంలోఅన్ని శాఖల నివేదికల ఆధారంగా రీచ్‌లకు అనుమతులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. మన ఇసుక – మన వాహనం" పోర్టల్‌లో నమోదు చేసుకున్న వాహనాలకు మాత్రమే ఇసుక రవాణా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. రవాణా ప్రతి దశలో పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఇసుక సులభంగా అందుబాటులోకి రావడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకరవాణా అందేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారులపై ఎలాంటి అదనపు భారం పడకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇసుక రవాణా పూర్తిగా పారదర్శకంగాజరుగుతోందని, ఈ విషయంలో ఎలాంటి అపోహలకు తావు లేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.

# నూతన సర్పంచుల సంఘం కార్యవర్గం ఎన్నిక

### గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



నూతన సర్పంచ్‌ల సంఘం కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

**నవాబుపేట, మే 21 ప్రభాతవార్త:** గ్రామాల ప్రజల సమస్యలు తీర్చేందుకు అభివృద్ధి పథంలో గ్రామాలను తీర్చిదిద్దేలా పని చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల సర్పంచ్ ల సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. మండల సర్పంచ్ అధ్యక్షుడుగా కాకర్జల సర్పంచ్ సంతోష్‌నాయక్, ఉపాధ్యక్షునిగా కామారం సర్పంచ్ వెంకటేష్‌నిమండల సర్పంచుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. మండల అధ్యక్షుడు మూడవత్ సంతోష్ నాయక్ ఉపాధ్యక్షులు వెంకటేష్ రాములు యాదవ్ మాట్లాడుతూ సర్పంచ్ ల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తమని ప్రజల మండలాలు పొందేలా గ్రామాల అభివృద్ధికి తోడ్పడతామని అన్నారు. నవాబుపేట మండల సర్పంచుల సంఘం నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన శాసన సభ్యులు అనిరుద్ రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో, కాంగ్రెస్ పార్టీ సర్పంచులఆధ్వర్యంలో నూతన కమిటీని ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. మండల అభివృద్ధికి ఈ కమిటీ ఎంతగానో తోడ్పడుతుందని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. మూడవాత్ సంతోష్ నాయక్‌ఉపాధ్యక్షులు కామారం సర్పంచ్ వెంకటేష్, తిమ్మాయిపల్లి సర్పంచ్ రాములు యాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, సిద్ధటం సర్పంచ్,కోశాధికారి శంకరయ్య, కరూర్ సర్పంచ్ సంయుక్త కార్యదర్శి అఖిల, స్వాతి, నవాబుపేట మండలంలోని అన్ని గ్రామాలను ప్రగతి పథంలో నడిపించడానికి నూతన కమిటీ సభ్యులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలపరిధిలోని గ్రామాల సర్పంచులు కామారం సర్పంచ్ వెంకటేష్, పోమాల్ సర్పంచ్ కవిత,నరేష్ ఇప్పటూరు సర్పంచ్ రవికిరణ్, కాకరజాల సర్పంచ్ రాజయ్య, కారుకొండ సర్పంచ్ సంతోషి భూపాల్ రెడ్డి, శంకర్, మల్రెడ్డిపల్లి సర్పంచ్ నవనీత రవి, తిమ్మాయపల్లి సర్పంచ్ రాములు పాల్గొన్నారు.

## కొండారెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన జి.చిన్నారెడ్డి

**ఎద్దమందడి, మే 21 ప్రభాతవార్త :** పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు కొండారెడ్డి భార్య శకుంతల మరణించిన విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల్ల చిన్నారెడ్డి వారి ఇంటికి వెళ్లి కొండ రెడ్డిని, వారి కుటుంబాన్ని పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, వనపర్తి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు సహదేవుడు, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా తదితరులు ఉన్నారు.

## అందుబాటులో సబ్సిడీపై జీలుగ విత్తనాలు

**గోపాల్ పేట,మే21 ప్రభాతవార్త:** గోపాల్‌పేట మండల పరిధిలోని రైతులకు వ్యవసాయ శాఖ శుభవార్త తెలిపింది. మండలంలోని ప్రాథమిక సహకార సంఘం (సింగిల్ విండో)తో పాటు రైతు ఆగ్రో సేవా కేంద్రం, గోపాల్‌పేటలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారి తెలిపారు.30 కేజీల జీలుగవిత్తనాల బస్తా మొత్తం ధర రూ.4905కాగా, ప్రభుత్వం 50శాతం సబ్సిడీ అందిస్తున్నందున రైతులు కేవలం రూ.2452.50 మాత్రమే చెల్లించి పొందవచ్చని పేర్కొన్నారు.జీలుగ విత్తనాలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

## బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి

### లయన్ అశ్విని చంద్ర శేఖర్

**దేవరకద్ర, మే 21 ప్రభాతవార్త:** బడి ఈడు కలిగిన ప్రతి ఒక్కరిని ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా దేవరకద్ర మండలం లక్ష్మీ పల్లిలో గురువారం జరిగిన బడిబాట కార్యక్రమంలో లక్ష్మీ పల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ సుశిక్షితులైన, అపార అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల పటిష్టతకు, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీ ధర్, నాగేశ్వర్ రెడ్డి, మదన్ మోహన్, కొండయ్య, అంగన్‌వాడీ కార్య కర్త లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యాల కొనుగోలు కేంద్రాల పరిశీలన

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పురోగతిని పరిశీలించారు.లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సహాయం, నిర్మాణ సామగ్రి లభ్యత, పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.లబ్ధిదారులకు సామాగ్రి, ఇసుక,ఇతర అవసరమైన నిర్మాణ సామగ్రి సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, పనులు మధ్యలో నిలిచిపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్లపథకాన్ని అమలు చేస్తోందని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, చివరి దశలో ఉన్న ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను అధికారులను గుర్తించి రెండోవ విడతలో ప్రభుత్వం అందజేసే ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహసిల్దార్ వెంకట్, సింగిల్ విండో అధ్యక్షులు హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ట్రేడర్లపై కఠిన చర్యలు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను తప్పుదోవ పట్టించి అన్యాయం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.గత రెండు రోజుల క్రితం రాత్రి మార్కెట్ యార్డును సందర్శించిన సమయంలోరైతులు తమ ధాన్యాన్ని బయట ఉంచుతున్నారని, ట్రేడర్ల ధాన్యాన్ని మాత్రం షెడ్లలో నిల్వ చేస్తున్నారని తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వెంటనే డీజీ విజిలెన్స్ చౌహాన్‌తో మాట్లాడి పూర్తి స్థాయిలో విచారణ జరిపి అక్రమంగా నిల్వ ఉంచిన ధాన్యాన్ని బయటకుతరలించవద్దని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు.రైతులను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, పిఎసిఎస్ నిర్వాహకులు, మార్కెట్ కమిటీ అధికారులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుంది

**మొదటి పేజీ తరువాయి భాగం..**

చిరస్మరణీయమని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత, మహిళలు, రాజకీయాల్లో ముందుకు వచ్చి, ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అదేవిధంగా గ్రామాల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, వంటి మౌలిక వసతులు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధికి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ అయిన రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ గ్రామీణ అభివృద్ధి స్థానిక సంస్థల బలోపేతం ప్రజాస్వామ్య వికేంద్రీకరణ లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు చేరే విధంగా రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలు, దేశ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలిచాయని కొనియాడారు.కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటుగ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి,దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు,ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోక్సో బాధితులకు ఒకేచోట అన్ని సేవలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఇతర అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధునిక భారత నిర్మాణ శిల్పి మాజీ ప్రధాని..భారత దేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ ఆధునిక భారత నిర్మాణ శిల్పి,యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసంఅందరం కృషి చేయాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు.మాజీ ప్రధానమంత్రి స్వర్గీయరాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీపాత్ర ఎంతో కీలకమైనదని,కంప్యూటర్ విప్లవానికి నాంది పలికి, సమాచార సాంకేతికత అభివృద్ధికి బాటలు వేసిన మహానేతగా ఆయన చిరస్మరణీయులు. అని వారుప్రశంసించారు.యువ భారతానికి కొత్త దిశను చూపిస్తూ దేశ అభివృద్ధి కోసంఆధునిక ఆలోచనలతో ముందుకుసాగిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీగారు.ఆఅనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోరోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వే పారదర్శకంగా జరగాలి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అధికారులు కట్టుదిట్టంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన సిబ్బంది ప్రజలు అందించిన వివరాలను మాత్రమే నమోదు చేయాలని, ఇతర వివరాల స్వీకరణను చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చితమైన సమాధానాలు చెప్పాలని,దీనివల్ల ప్రభుత్వానికి సరైనలెక్కలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకట్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈఓ బషీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో బైక్ మెకానిక్ షాపులు దగ్ధం

**బాలానగర్, మే21 ప్రభాతవార్త :** బాలానగర్ మండల కేంద్రంలోని స్థానిక జడ్చర్ల బస్టాండ్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రెండు బైక్ మెకానిక్ షాపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో షాపుల్లో ఉన్న 17 బైకులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘట నాస్థలికి చేరు కుని రెండు ఫైర్ ఇంజన్లతో సుమారు మూ డు గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై లెనిన్ తెలిపారు. ప్రమాదంలో భారీ ఆస్తి నష్టం సంభవించిం దని, బాధితులను ప్రభుత్వం ఆదుకుని తగిన నష్టపరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు.

వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

I Fazul S/o Feroz Khan, Residing at 20-131/11, BC Cly, Kosgi (M), Narayanpet Dist., my minor Son Name changed from FAWWAZ S/o FAZUL to FAWWAZ KHAN S/o FAZUL.

గమనిక

## సంక్షేమ బోర్డు ద్వారానే పథకాలు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న టీయుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్

**ఆత్మకూర్ మే21,ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులకు మరియు అసంఘటిత రంగ కార్మికులకు అందజేస్తున్నటువంటి పథకాలను సంక్షేమ బోర్డు ద్వారానే అమలు చేసేందుకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేయాలని టీయుసిఐ జిల్లా అధ్యక్షులు ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో పెయింటర్స్ ఆత్మకూర్ మండల అవగాహన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కార్మికుల పోరాటాల మూలంగానే భవన నిర్మాణ మరియు పెయింటర్స్ కార్మికుల కు సంక్షేమ బోర్డు ద్వారా పథకాల కొనసాగించేందుకు ప్రభుత్వం జీవో జారీ చేసిందని ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం కార్మికులకు దక్కాల్సిన పథకాలను సంక్షేమ బోర్డు ద్వారా కాకుండా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తీవ్రంగా కార్మికులు వ్యతిరేకించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం భవన నిర్మాణ కార్మికులకు అసంఘటిత రంగకార్మికులకు చెల్లిస్తున్న ప్రమాదబీమా పథకాన్ని 10లక్షలకు పెంచాలనిఅంతేకాకుండా కార్మికులు తమవృత్తిని కొనసాగించుకునేందుకు బ్యాంకర్ల ద్వారా ఎలాం టి షరతులు లేకుండాఆర్థిక సహాయం చేసేందుకు చర్యలు చేపట్టాలనిఆయన విజ్ఞప్తిచేశారు. అందులో భాగంగానే 25న హైదరాబాదులో నిర్వహించనున్న భవన నిర్మాణ కార్మికుల సదస్సుకు జిల్లావ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆత్మకూర్, అమరచింత, మదనాపురం, నర్వ మండలాలు చెందిన పలువురు పెయింటర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన

**దామరగిద్ద, మే 21 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలం లోకుర్తి గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రంనారాయణపేట్ ఆధ్వర్యంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డా. ఓ. శైల రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. రసాయన ఎరువులు, యూరియా, ఇతర కాంప్లెక్స్ ఎరువుల వాడకాన్ని తగ్గించి పచ్చిరొట్టె ఎరువులు,పశువుల ఎరువులు, కోళ్ల ఎరువులు, వానపాముల ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు.దీంతో నేల ఆరోగ్యం, భూసారం మెరుగుపడుతుందని తెలిపారు. అలాగే నీటి యాజమాన్యం, కలుపు నియంత్రణ, యాంత్రికరణ, సస్యరక్షణ చర్యలు, డ్రోన్ల వినియోగం వంటి ఆధునిక వ్యవసాయ పద్ధతులను రైతులు అనుసరించాలని సూచించారు.వచ్చే వానాకాలంలో పంటమార్పిడి చేపడుతూ నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు.వ్యవసాయ అధికారి బాలాజీ మాట్లాడుతూ ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని, మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ సుఖేష్ మాట్లాడుతూ రైతులు స్వయంగా లుగా ఏర్పడి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేసే అవకాశాలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అజయ్ కుమార్, లోకుర్తి సర్పంచ్ రాజు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రతిభకు సత్కారం - విజయానికి ప్రోత్సాహం



పాఠశాల టాపర్లను సన్మానించిన దృశ్యం

**దామరగిద్ద, మే21 ప్రభాతవార్త:** దామరగిద్ద మండలంలో పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) దామరగిద్ద శాఖ ఆధ్వర్యంలో ఘనసన్మాన కార్యక్రమంనిర్వహించారు.మండల అధ్యక్షుడు అంబరీష్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో టాపర్ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు నరసింహ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఎన్నో అవరోధాలను ఎదుర్కొని ప్రతిభ చాటుతున్నారని తెలిపారు.ప్రభుత్వ బడి పిల్లలు ప్రతిభ గల పిడుగులని, తల్లిదండ్రులుతమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.పదవ తరగతి ఫలితాల్లో ప్రతి పాఠశాల నుండి టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందించి శాలువాలతో సన్మానించారు. అలాగే 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో పాటు మండలంలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా ప్రత్యేకంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గుంపు బాల్రాజ్,ప్రధానోపాధ్యాయులు సురేష్ కుమార్, గ్రామ సర్పంచ్ కనికి రెడ్డి, ఉప సర్పంచ్ సత్యనారాయణ,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తపస్ జిల్లా మరియు మండల నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసులు, నరేష్, విశ్వేశ్వరయ్య, శంకరప్ప, జానకి రాములు, అంజలయ్య, వేణుగోపాల్, శశిధర్, గఫర్, కవిత, విజయ్, ప్రసాద్, మాణిక్ రావు, దత్తాత్రేయ, కురుమూర్తి, సక్సేన, అనురాధ, మహిపాల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతి అయిన ఐదు దుకాణాలు

● ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించిన ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ





ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

**అచ్చంపేట, మే,21 ప్రభాతవార్త:** అగ్నిప్రమాదంలో ఐదు దుకాణాలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. వివరాల్లోకి వెళితే అచ్చంపేట నియోజకవర్గంపదర మండలం మద్దిమడుగు శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఐదు దుకాణాలు దగ్ధమయ్యాయి.విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు వివరించారు.అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సంఘటన స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు.అగ్ని ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పరామర్శించారు.ప్రమాద స్థలాన్ని పరిశీలించి నష్టపోయిన బాధితులుగౌస్, సందీప్,శ్రీను, వెంకటేష్, మల్లేష్‌లను పరామర్. ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.జిల్లా కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడి బాధిత కుటుంబ సభ్యులను త్వరగా ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు అనంతరం కొంత ఆర్థికసహాయం అందజేయడంజరిగింది.వారితో పాటు మండల నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## ప్రకృతి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్,వాసవి వనిత క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్

**మక్తల్ టౌన్, మే,21 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణంలో గల శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు మక్తల్ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలకు ఉచితంగా ఆర్యవైశ్య అనుబంధ సంఘాలు,వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అక్ ప్రెజర్ సుకాస్ కప్పింగ్ వైబ్రేషన్ తెరపి చికిత్స శిబిరాన్ని వాసవి క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ మనసాని దేవిపద్మావతి, మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, వైస్ చైర్మన్ శైవిరెడ్డి అమర్, కౌన్సిలర్ వెంకటేష్ ప్రారంభించారు. అనంతరం వాసవి మాత చిత్రపటానికి వనిత క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ మనసాని దేవి పద్మావతి, మున్సిపల్ చైర్మన్ పూజలు చేసి, డాక్టర్లు వచ్చిన అతిథులకు, ప్రజలకు గ్యాస్ ట్రబుల్ నడుము నొప్పి మెడ నొప్పి వంటి ఆరోగ్య సమస్యలకు సంబంధించిన ప్రకృతి వైద్యాన్ని డాక్టర్ డీకే వైష్ణవ్, విష్ణులు చికిత్స చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచితంగా ప్రకృతి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య అనుబంధ సంఘాలకు, వాసవి క్లబ్ వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికీ అందుబాటులో తమ తమ సమస్యల కోసం వాసవి మాత దేవాలయంలో ఐదు రోజులు క్యాంపు నిర్వహించామని పట్టణ ప్రజలు ఏ వయసు వారైనా ఏవైనా సమస్యలు ఉంటే ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అలాగే సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఇక్కడికి విచ్చేసి చికిత్స చేసుకోగలరని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వాకిటి మానస హనుమంతు, వైస్ చైర్మన్ శైవిరెడ్డి అమర్, కౌన్సిలర్ వెంకటేష్, వాసవి వనిత క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ మనసాని దేవి పద్మావతి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ మెడిశెట్టి హరికృష్ణ, లైన్స్ క్లబ్ జోన్ చైర్మన్ అనకొండ శ్రీనివాస్, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షులు కల్వ శ్రీనివాస్, కట్ట సురేష్, బిలకంటి నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

### ఉదయం 5:30 గంటలకే

# ఉపాధి పనులు ప్రారంభించాలి

- ◆ కూలీలకు ఎక్కువ రోజులు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ◆ ఉపాధి హామీ పథకం పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- ◆ లింగాల మండలంలో ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్



జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్‌ను సన్మానించి, మొక్కను అందజేస్తున్న ఉపాధి కూలీలు

**లింగాల,మే 21,ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ జిల్లాలో ఉపాధి హామీ పథకం నరేగా కింద చేపడుతున్న వేజ్ కంపోనెంట్, మెటీరియల్ కంపోనెంట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రణాళికలో ఉన్న అన్ని అభివృద్ధి పనులను వెంటనే గ్రౌండింగ్ చేసి, నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం లింగాల మండలంలోని సూరాపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలు చేపడుతున్న వ్యవసాయానికి అనుబంధంగా భూమి చదును (ల్యాండ్ లెవెలింగ్) పనులను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ పనులు జరుగుతున్న క్షేత్రస్థాయిలో పరిశీలించి,అధికారులు,ఉపాధి హామీ కూలీలతో పనుల వివరాలను వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంపొందించడంతో పాటు అభివృద్ధి పనులను సమర్థవంతంగా అమలు చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్రామంలో చేపట్టిన పనులు ఆలస్యం కాకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, వేజ్ కంపోనెంట్ కింద కార్మికులకు ఎక్కువ రోజుల ఉపాధి కల్పించే పనులను ప్రాధాన్యంగా చేపట్టాలని, మెటీరియల్ కంపోనెంట్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. చెరువుల అభివృద్ధి,కాలువల నిర్మాణం, గ్రామీణ రహదారుల మరమ్మతులు, వర్షపు నీటి నిల్వ పనులు, పచ్చదనం పెంపు కార్యక్రమాలు వంటి పనులను వేగంగా పూర్తి చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, నరేగా పథకం ఈ ఏడాది జూన్ 30 వరకు మాత్రమే కొనసాగుతుందని, జూలై 1 నుంచి కొత్తగా వీబీజీ రామ్ పథకం అమల్లోకి రానుందని, కొత్త పథకం అమలుకు సంబంధించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను ముందుగానే సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.గ్రామాల్లో చేపట్టిన ప్రతి పనిపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని, ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలనే ప్రాధాన్యంతో అమలు చేయాలని ఆయన తెలిపారు. కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, పనుల్లో నిరక్ష ్యం వహించిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.కలెక్టర్ కూలీలతో మాట్లాడి రోజుకి ఎంత కూలీ పడుతుంది అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ఉదయం 5:30 గంటలకు పనులు ప్రారంభించేసుకోవాలని, కూలీల వివరాలను అప్లోడ్ చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో లింగాల తహసిల్దార్ వెంకట్, ఎంపీడీవో,ఎపిఓ ఇమామ్ అలీ,మండల విద్యాధికారి బషీర్ అహ్మద్,సంబంధిత శాఖల అధికారులు,మండల స్థాయి సిబ్బంది, గ్రామ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి

- బక్రీద్ పండుగ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు
- పాత నేరస్థులపై నిఘా పెట్టాలి
- మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణపై సమీక్షలో ఎస్పీ జానకి ధరావత్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, మే21, ప్రభాతవార్త:** జిల్లాలో బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ వెల్లడించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ డి.జానకి నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలో నమోదైన వివిధ నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, మహిళలు చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు,రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల నియంత్రణ, గంజాయి, అక్రమ రవాణా నివారణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు చేస్తూ, ప్రతి కేసును నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెండింగ్ వారెంట్లు, పీటీ వారెంట్లు, బైండోవర్ కేసులు, గ్రీవెన్స్ పిటిషన్లు, మహిళా భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై కఠిన అమలు చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరంనిర్వహించాలని తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూతావు లేకుండాకఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులకు సత్వర సేవలు అందించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీసూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్.బి రత్నం,డీఎస్పీలు, వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, బాలాజీ, ఇన్స్పెక్టర్లు అప్పయ్య, ఇజాజుద్దీన్, మోతిరాం, నాగార్జునగౌడ్, కృష్ణయ్య, సీఐలు గాంధీ నాయక్,రామకృష్ణ, ఎస్‌హెచ్‌వోలు ఐటీ సెల్ ఎస్సై రాఘవేంద్ర, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ఎగ్గొట్టింది

● దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



సబ్సిడీతో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగ విత్తనాల పంపిణీ చేస్తున్న జిఎంఆర్

**దేవరకద్ర,మే 21 ప్రభాతవార్త:** రైతులకు అందాల్సిన సబ్సిడీలను గత ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించకుండా నిర్లక్ష్యం చేసిందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి విమర్శించారు. దేవరకద్ర మండలకేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 50 శాతం సబ్సిడీతో రైతులకు పచ్చి రొట్టె విత్తనాలు, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ప్రస్తుతం రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.రైతులకు విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ, పరికరాల పై పారదర్శకంగా సబ్సిడీలు అందిస్తున్నామని పేర్కొన్నారు.దేవరకద్ర నియోజకవర్గంలోని రైతులు ఎలాంటి ఇబ్బందులుపడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. గతంలో రైతులను మోసం చేసిన విధానాలకు భిన్నంగా ప్రస్తుతం రైతు సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. అభివృద్ధి కోసం ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పచ్చి రొట్టె పంటల సాగుతో భూమి సారవంతం పెరిగి దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు.రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకుంటూ, రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు, వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీ, సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు అంజిల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్‌రెడ్డి, కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, అగ్రికల్చర్ ఏవో రాజేందర్ అగర్వాల్, మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్‌రెడ్డి,వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, కౌకుంట్ల ఏవో శివకుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు , రైతులు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు అభివృద్ధి చేసి చూపిస్తున్నాం

● జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి



మహిళా సమాఖ్య భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నవాబ్‌పేట, మే 21 ప్రభాతవార్త:** గత ప్రభుత్వం పదులలో చేయలేని అభివృద్ధి పనులను రెండేళ్లలో చేసి చూపిస్తున్నామని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కారూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, మహిళా సమైక్య భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించేందుకుగ్రామపంచాయతీ భవనాలు కీలకంగా పని చేస్తాయని అన్నారు. మహిళలఆర్థిక, సామాజిక సాధికారత కోసం మహిళా సమైక్య భవనాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అనంతరం కారుకొండలో 30లక్షలతో గోదాం నిర్మాణానికి భూమి పూజ చేశారు.దయపంతులపల్లిలో మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రాన్ని,కేజీబీవీ కాంపౌండ్ వాల్ ప్రారంభించారు. వెంకటేశ్వర తండా ఐమాక్స్ లైట్లుచౌదూరులో వరి కొనుగోలుని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డితో పాటు మాజీ డిసిసి అధికార ప్రతినిధి దుష్యంత్ రెడ్డి మండల అధికారులు తాసిల్దార్ సురేష్ ఎంపీడీవో జయరాం నాయక్ ఏపీఎం శ్రీహరి, సర్పంచులు కారూర్ సర్పంచ్ శంకర్ నవాబుపేట సర్పంచ్ గీతా రాణి సంతోషి,మార్కెట్ చైర్మన్ హర లింగం,వైస్ చైర్మన్ తులసి రామ్ నాయక్,కాంగ్రెస్ నాయకులు ప్రజా ప్రతినిధులు భూపాల్ రెడ్డి తానెం సురేష్‌లక్ష్మయ్య గుండేటి,యాదయ్య మణికంఠ బంక వెంకటయ్య అంజన్ కుమార్ కొల్లి నర్సింలు శిల్ప సత్యం, కాజా పాషా తదితరులు పాల్గొన్నారు.

## యూరియా వాడకాన్ని తగ్గించి నెలసారాన్ని కాపాడండి



**మిడ్జిల్, మే21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొత్తూరు గ్రామం రైతు వేదిక యందు గురువారంపలు రైతులతో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు అర్చన కల్పన మాట్లాడారు. అవసరమైన ఎరువులను వాడాలని యూరియా వాడకాన్ని తగ్గించాలని తక్కువ యూరియా వాడడం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా నేల సారాన్ని కాపాడుకోవచ్చని అవసరం మేరకే రసాయనాలను వాడాలని సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని సేద్యం చేయాలని తెలిపారు. సేంద్రీయ పద్ధతుల్లో వ్యవసాయాన్ని చేసి ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని వారు తెలిపారు. మార్కెట్లో ఎక్కువ కొనుగోలు చేసే వరి రకాలను పండించడం వలన అద్భుత దిగుబడితోపాటు ప్రభుత్వం ఇచ్చే బోనస్ ను పొందుకోవచ్చని చెప్పారు. నీటి యాజమాన్య పద్ధతులను పాటించి వాటి వలన నీటిని ఆదా చేసుకొని భావితరాలకు ఇవ్వడం మన బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో సిద్ధాంత, సర్పంచి రాములు, మాజీ సర్పంచులు ప్రతాప్ రెడ్డి, వార్డ్ మెంబర్లు, ఉప సర్పంచ్, రైతులు వెంకటయ్య, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగా హరీష్ గౌడ్

**ఆత్మకూర్‌మే21, ప్రభాతవార్త:** ఆత్మకూరు మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్ గౌడ్ ను ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమించినట్లుగా ఆయన ప్రభాతవార్తకు తెలిపారు. ఈ మేరకు మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిడి శ్రీహరి ఆదేశాలతో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనరెడ్డి ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులుగానియామక పత్రం అందజేసినట్లుగా ఆయన తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పని చేస్తున్నటువంటి నేను మంత్రి వాకిడి శ్రీహరి ఆశీస్సులతో మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఆత్మకూరు మండల యువజన కాంగ్రెస్అధ్యక్షులుగా హరీష్‌గౌడ్ నియామకం కావడం పట్ల మండలానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

## నూతన ఎస్సైకి సన్మానం

**ఉప్పునుంతల, మే 21 ప్రభాతవార్త :** ఉప్పునుంతల నూతన ఎస్సై పుట్ట మహేష్ గౌడ్‌ను గురువారం బిఆర్ఎస్ నాయకులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. గతంలో పనిచేసిన ఎస్సై వెంకట్ రెడ్డి బదిలీ కాగా, ఇటీవల ఆయన స్థానంలో పుట్ట మహేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి.మహేష్‌ను బిఆర్ఎస్‌నాయకులు ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు. సన్మానించిన వారిలో బిఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్ రావు, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కట్ట గోపాల్ రెడ్డి, బాలు నాయక్, సుమన్ రెడ్డి, కృష్ణయ్య యాదవ్, సర్పంచు మున్న, ఉప సర్పంచ్ లు పానుగంటి శంకర్, రమేష్, దేవేందర్, వసురాం, శ్రీనివాస్ గౌడ్, వెంకటయ్య,ఎల్లగౌడ్, కురుమయ్య, శ్రీను, సుధాకర్, ఎల్లయ్య యాదవ్, చిన్న జంగయ్య తదితరులున్నారు.

## అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన విద్యార్థికి ఘన సన్మానం

**ఉప్పునుంతల, మే 21 ప్రభాతవార్త :** మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన ఆర్కపల్లి అరవింద్‌కుస్తీ పోటీలో జాతీయ స్థాయికి ఎదగడంతో టి పిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ఘనంగా సన్మానం పొందారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లమల్ల వాసి జాతీయస్థాయి క్రీడల్లో ఎంపిక కావడండం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, ఉప్పునుంతల సర్పంచు చింత గాళ్ళ శ్రీనివాసులు, కంసానిపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోపి రెడ్డి రఘుపతి రెడ్డి, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపిరెడ్డి రమేష్ రెడ్డి, రత్లావత్ కృష్ణ, యూత్ కాంగ్రెస్ ఇంఛార్జి అంతటి శేఖర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**నారాయణ పేట, మే 21 ప్రభాతవార్త:** నారాయణపేట ఎమ్మెల్యే డా. చిట్టెం పర్ణికరెడ్డి, మాజీ డీసీసీ సభ్యులు కుంభం శివకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు,పేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి ఆధ్వర్యంలోజలాల్‌పూర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి.మహాలింగప్ప, ఉపసర్పంచ్ ఆర్.మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు, నియోజకవర్గ అసెంబ్లీ సెక్రటరీ ఆర్. కార్తీక్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షులు కర్నె మోహన్ రెడ్డి, భగవంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, కోటకొండ హన్మంతు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులువాకిటి శివలింగప్ప, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కె. తిమ్మారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎన్.తమ్మప్ప, నాలుగో వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, యువకులు, కార్యకర్తలు, వాకిటి అనిల్ కుమార్, కె. శివారెడ్డి, కంబారి హన్మంతు, హోటల్ మారుతి, శివప్రసాద్, రాకొండ అనిల్ రెడ్డి తదితరులతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫేస్ రికగ్నిషన్ యాప్ ద్వారా పింఛన్ల సర్వే : కమిషనర్ డి.మురళి

**అచ్చంపేట,మే,21 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో పింఛన్ దారుల గుర్తింపునకు ఫేస్‌రికగ్నైజ్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నట్లు కమిషనర్ మురళి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డ్ ఆఫీసర్లకు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో మొత్తం 1,992 మంది పింఛన్ దారులు ఉన్నారన్నారు. ఇందులో 580 వృద్ధాప్య,960 వితంతు,266 వికలాంగ, 179 ఒంటరి మహిళలతో పాటు 7 గీత కార్మిక పింఛన్లు ఉన్నట్లు వివరించారు. మున్సిపల్ సిబ్బందితో వార్డుల్లో ఈ సర్వే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చెయ్యాలని వివరించారు. అదేవిధంగా వార్డుల్లో అందరు లబ్ధిదారులు వార్డు ఆఫీసర్లకు సహకరించాలని ఆయన కోరారు.

## ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ

**కొల్లాపూర్, మే21,ప్రభాతవార్త:** పెద్దకొత్తపల్లి మండలం నక్కలపల్లి గ్రామములో ఉపాధి హామీ పథకంలో భాగంగా గురువారం ఉపాధి కూలీలు ఎండకు వెళ్లి ప్రతిరోజు పని చేస్తున్న ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సర్పంచ్ మొట్టే కురుమయ్య పంపిణీ చేశారు.ఈ సందర్భంగాసర్పంచ్ మాట్లాడుతూ ఎండాకాలం ప్రతి ఒక్కరూ రోజుకి ఐదు నుంచి ఎనిమిది లీటర్ల వరకు వాటర్ తాగితే ఖచ్చితంగా ఎండాకాలంలో చాలా ఆరోగ్యవంతంగా వడదెబ్బ తడలకుండా ఉంటరని, కూలీలందరూ ఉదయం 6:00 ఆరు గంటలకే పనికి వచ్చి 9:00నుండి 10:00 గంటల వరకే పని ముగించుకుని వెళ్లాలని కోరారు. ఉపాధి హామీ పనికి వెళ్లే ప్రతి ఒక్కమహిళ,గ్రామ పెద్దలు అందరూ ఎక్కువ మొత్తంలో నీళ్లు తాగాలని అలాగే తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరడం జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా మీరు పని చేసిన దినసరి కూలి మస్టర్ ప్రకారంగా డబ్బులు పడే విధంగా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటుంది. ప్రతి ఒక్కరి అకౌంట్లో డబ్బులు పడే విధంగా ప్రభుత్వ అధికారులు గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఎక్కడ తప్పులు జరగకుండా చూసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమములో ఉపసర్పంచ్ కొత్త రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మేకల మల్లేష్,గ్రామ వార్డు మెంబర్స్, గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది, ఉపాధి హామీ పథకం కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకుడు హఠాన్మరణం

### నివాళులర్పించిన ఎమ్మెల్యే జిఎంఆర్



కాంగ్రెస్ నాయకుడు ఎర్రోళ్ల హనుమంతు (ఫైల్)

**దేవరకద్ర మే21 ప్రభాతవార్త:** గుండెపోటుతో కాంగ్రెస్ నాయకుడు మృతి చెందిన సంఘటన దేవరకద్ర మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే దేవరకద్ర మున్సిపాలిటీలోని పెద్ద గోప్లాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎర్రోళ్ల హనుమంతు (52) గుండెపోటుతో హఠాన్మరణం పొందాడు. గ్రామంలో అందరితో కలిసమెలిసి ఉండే వ్యక్తి చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ఈ సందర్భంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.